
# కథ

# పడి లేచిన కెరటం

బి.వి.శేషమాంబ

ఊరు నుంచి రాగానే పిడుగు లాంటి వార్త వినిపించింది అమ్మ ''జీవిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకి ప్రయత్నించి హాస్పిటల్లో ఉంది'' అని. కంగారుగా హాస్పిటల్‌కి పరుగెత్తాను.

ప్రైవేట్ హాస్పిటల్లో స్పెషల్ రూంలో బెడ్ మీద నీరసంగా పడుకుని ఉంది జీవిత. చేతికి సెలైన్ పెట్టి ఉంది. పక్కన స్టూల్ మీద కూర్చుని ఉంది ఆంటీ.



నన్ను చూడగానే జీవిత ముఖంలోకి వెలుగొచ్చిం ది. ''ఏం జరిగింది జీవితా!'' అడిగాను ఆత్రంగా.

''తొందరపాటు'' అంది జీవిత.

''ఇంత పిరికితనం నీకు లేదు. అసలేం జరిగింది?'' అడిగాను.

''నా మీద నీకెంత నమ్మకం? ఇలాంటి పని నేను చేశానంటే నువ్వు నమ్మట్లేదు'' అంది జీవిత నవ్వుతూ.

''నా గురించే అనుక్షణం ఆలోచిస్తుంటావు. అలాంటిది ఆ క్షణంలో నేను గుర్తు రాలేదా?'' అడిగింది ఆంటీ.

''వదిలేయమ్మా ఆ సంగతి. అదొక బలహీన క్షణం. చూడు ఎంత గట్టి పిండాన్ని కాకపోతే అన్ని నిద్రమాత్రలు మింగి కూడా బ్రతికానంటావు?'' నవ్వింది జీవిత.

''అసలింత పిచ్చి పని ఎందుకు చేశావు?'' అడిగాను.

''ఆకాశ్ తన పేరెంట్స్ పెళ్లికి ఒప్పుకోవటం లేదు కాబట్టి నా దారి నన్ను చూసుకోమన్నాడు'' అంది.

షాకయ్యాను నేను.

''ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇంటికొచ్చి ఆకాశ్ జోలికి వెళ్లొద్దంటూ అసభ్యంగా మాట్లాడి వార్నింగిచ్చాడు. దాంతో అప్‌సెట్ అయ్యాను'' అంది జీవిత క్లుప్తంగా.

తను వివరంగా చెప్పట్లేదు కానీ ఎంత హర్టయి ఉండకపోతే ఆత్మహత్యకి ప్రయత్నిస్తుంది అనుకున్నాను.

ఇది దాదాపు ఓ నెల రోజులుగా నడుస్తున్న తంతు. వీళ్లిద్దరూ మూడేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. ఆ సంగతి ఆకాశ్ పేరెంట్స్‌కి, ఆంటీకి తెలుసు. జీవిత తనకి వచ్చిన మంచి మాచ్‌ని కూడా రిజెక్ట్ చేసింది. పెళ్లి విషయానికి వచ్చేసరికే అసలు గొడవ మొదలైంది. ఆకాశ్ పేరెంట్స్

ఒప్పుకోలేదు. వాళ్లని కన్విన్స్ చేసి పెళ్లి చేసుకుంటాడని నేను చాలా నమ్మకంతో ఉన్నాను. హఠాత్తుగా కథ ఇలా మలుపు తిరిగింది.

ఇంతలో గది బైట హడావిడి మొదలైంది. మరుక్షణం ఓ గుంపు గదిలోకి జొరబడింది. ఖద్దరు బట్టల్లో అందర్లోకి దర్పంగా కనిపిస్తున్న మా ఎమ్మెల్యేని గుర్తు పట్టి ఆంటీ, నేను ఆశ్చర్యంతో లేచి నిలబడ్డాము. జీవిత కూడా సర్దుకుని కూర్చుంది.

''నాకంతా తెలిసిందమ్మాయ్! అయినా ప్రేమ గురించి ప్రాణాలు తీసుకుంటావా? ఈ కాలం పిల్లలకి ప్రాణం విలువ తెలీటం లేదు. మీ వీధిలోనే ఉంటున్నాను కదా! నీ సమస్య నాతో చెప్పకూడదా? నేను పరిష్కరించేవాడిని కదా! ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. ఆకాశ్ పేరెంట్స్‌తో మాట్లాడి నీకు న్యాయం జరిపిస్తాను'' గడగడా మాట్లాడేస్తున్నాడు ఎమ్మెల్యే.

''వద్దు, వద్దు'' అంది జీవిత కంగారుగా.

''నువ్వేమీ భయపడద్దు. వాళ్ల బెదిరింపులకి మనం లొంగుతామా? ముందు ప్రేమించేప్పుడు ఊరుకొని పెళ్లికి ఒప్పుకోకపోవటం తప్పు'' ఉపన్యాస ధోరణిలో మాట్లాడుతున్న ఆయన్ని మధ్యలో అడ్డుకుంటూ-

''ఇప్పుడు ఆకాశ్‌ని చేసుకునే ఉద్దేశ్యం నాకు లేదు. దయచేసి మీరు కలగజేసుకోకండి'' అంది జీవిత నమస్కారం పెడుతూ. ఆంటీతో పాటు నేను కూడా ఆశ్చర్యపోయాను.

''గొడవలకి భయపడుతున్నావా? గొడవలేమీ కావు. నేను చెబితే వాళ్లు వినాల్సిందే'' అన్నాడాయన గర్వంగా.

ఇంతలో డాక్టర్ రావటంతో అందరూ తప్పుకుని దారిచ్చారు. డాక్టర్ ఎమ్మెల్యేని విష్ చేశాడు.

''పాపని జాగ్రత్తగా చూడండి డాక్టర్. కాబోయే పెద్దింటి కోడలు'' అంటుండగానే ఇద్దరు పత్రికా విలేఖరులు ఎమ్మెల్యేని విష్ చేస్తూ వచ్చారు. వస్తూనే ఆయన్ని, జీవితని గబగబా ఫోటోలు తీశారు. జీవిత గాభరాగా ఎడం చేయి ముఖానికి అడ్డుపెట్టుకుంది.

''ప్రాబ్లం లేదు. నేను ఆకాశ్ ఫామిలీతో మాట్లాడతాను. అంతా సుఖాంతమవుతుంది'' అంటూ అనుచరులతో సహా బైటికి నడిచాడు.

''ఏంటిదంతా? అసలు వీళ్లనెవరు రమ్మన్నారు? పెద్ద ఇష్యూ చేసి రోడ్డున పడేసేలా ఉన్నారు'' అంది ఆంటీ భయంగా.

''ఇప్పుడు ఆకాశ్‌ని పెళ్లిచేసుకునే ఉద్దేశ్యం లేదు బాబూ అన్నా వినడేం. అసలు వీళ్లకెందుకు మధ్యన?'' అంది జీవిత నీరసంగా.

''అది సరే ఆకాశ్‌ని పెళ్లి చేసుకోనంటావేంటి?'' అడిగాను.

''అతను పెద్దవాళ్లు ఒప్పుకోవటం లేదు కాబట్టి పెళ్లి చేసుకోను అన్నాడు. ఆ మాటతో నా మనసు విరిగిపోయింది. అతని దృష్టిలో ప్రేమకి విలువ లేదనుకుంటే అతని మీద విరక్తి కలిగింది. కాబట్టి చేసుకోవాలని లేదు'' కచ్చితంగా చెప్పింది జీవిత.

''నీవన్నీ తొందరపాటు నిర్ణయాలు. మరి అలా అనుకున్న దానివి ఆత్మహత్యకి ప్రయత్నించి ఇంత రభస చేయటం ఎందుకు?'' అంది ఆంటీ కోపంగా.

''అమ్మా! నేను తొందరపడింది ఆ ఒక్క విషయంలో మాత్రమే అని చెప్పానుగా'' అంది జీవిత.

''డాక్టర్ ఏమన్నారు? ఎప్పుడు డిశ్చార్జి చేస్తారు?'' అడిగాను.

''రేపొద్దున వెళ్లొచ్చని చెప్పారు'' అంది ఆంటీ.

★ ★ ★

డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్లాక మళ్లీ జీవితని కలిశాడు ఎమ్మెల్యే. అడక్కుండానే ధైర్యం చెప్పాడు. ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ కూడా వచ్చాడు. ''కేసు పెడతారా? స్టేషన్‌కి వచ్చి కంప్లయింట్ ఇస్తారా'' అంటూ. ఇప్పుడు ఏమీ ఆలోచించే పరిస్థితిలో లేమని అతన్ని పంపించేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది ఇద్దరికీ.

జీవిత, నేను, ఆకాశ్ ఇంజనీరింగ్ ఒకే కాలేజ్‌లో చదివాం. కాలేజీలోనే వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. ఆకాశ్‌వాళ్లు ఆస్తి, పలుకుబడి, రాజకీయ అండదండలున్న వాళ్లు. జీవిత ఫాదర్ రైల్వేలో మంచి హోదాలో ఉండగా మూడేళ్ల క్రితం చనిపోయారు. వాళ్ల పూర్వీకులందరూ తమిళనాడులో స్థిరపడిన వాళ్లే. జీవిత ఒక్కతే కూతురు కాబట్టి ఇద్దర్నీ

## ఆలోచన

'సినిమా ఇండస్ట్రీలోకొచ్చాక మన ఆలోచనలు ఆటోమేటిగ్గా మారిపోతూ ఉంటాయి. ఎప్పుడూ డిఫరెంట్‌గా ఆలోచించగలిగితే మన ఆలోచనలకు అనుగుణంగానే పాత్రలు కూడా దొరుకుతాయి. ఏ పాత్ర లభించినా మనకంటూ ఓ ఆశయం ఉండాలి. ఆ పాత్రలో జీవించగలగాలి' అంటోంది తెలుగమ్మాయి లయ. ఇప్పుడు తెలుగులో నటించడం తగ్గినా ఇతర భాషాచిత్రాల్లో తానెంతో బిజీగా ఉన్నానంటోంది లయ. చూడగానే ఆకట్టుకునే ఆమె రూపం ఇంకెన్ని అవకాశాల్ని దరిచేరుస్తుందో!



తమిళనాడు వచ్చేయమని తన బాబాయిలు, మామయ్యలు వత్తిడి చేసినా, ఇంజనీరింగ్ అయిపోయాక వస్తామని వీళ్లు సమాధాన పరిచారు. ఇక్కడ వాళ్లకి చెప్పుకోదగ్గ అండదండలు లేవు.

నాలుగు రోజుల పాటు వరుసగా జీవిత గురించిన వార్తలు పేపర్లో వచ్చాయి. ఆకాశ్ వాళ్లకి ప్రతిపక్ష రాజకీయ పార్టీ సపోర్ట్ ఉండటంతో పాలకపక్ష పార్టీ తరపున ఎమ్మెల్యేగారు రంగంలోకి దిగారన్న మాట.

★ ★ ★

ఆరోజు రాత్రి తొమ్మిది గంటలప్పుడు జీవిత హడావిడిగా మా ఇంటికి వచ్చింది.

''అర్జెంట్‌గా చెన్నయ్ వెళ్తున్నాము. వెళ్లినాక ఫోన్ చేస్తాను'' అంది.

''ఇదేంటి ఇంత హఠాత్తుగా? రిజర్వేషన్ లేకుండా ఎలా వెళ్తారు? అసలు ఇప్పుడు ఏ ట్రైన్ ఉంది?'' అడిగాను.

''ఏదో ఒకటి రైలో, బస్సో ఏది దొరికితే అది. ఇంటి తాళం నీ దగ్గరుంచు. అన్ని విషయాలు వివరంగా లెటర్ రాస్తాను. వస్తాను'' అంటూ వచ్చినంత వేగంగా వెళ్లిపోయింది జీవిత.

ఇంత హఠాత్తుగా ఏంటీ ప్రయాణం? ఓ పక్కన ఆకాశ్ ఫామిలీ పెళ్లికి ఒప్పుకోవటానికి సిద్ధంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని డీల్ చేస్తున్నాడు. ఏమీ అర్థం కాక బుర్రంతా ఆలోచనలతో వేడెక్కిపోయింది నాకు.

★ ★ ★

## కితాబుల మతాబులు

**పొడుగుకాళ్ల జవ్వని శిల్పాషెట్టి ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ అభిషేక్‌బచ్చన్ గురించే చెబుతోంది. 'అభి మంచి నటుడు. చాలా సింపుల్‌గా నటించడంలో, కొత్తదనాన్ని ఆహ్వానించడం అభికి సాటిలేరు' అని కితాబులు ఇస్తోంది. అభితో కలిసి రెండు మూడు సినిమాలు చేయాలని ఉందంటోంది. అన్నట్టు మునుపటి కంటే ఇప్పుడీభామ చాలా సెక్సీగా కన్పిస్తోంది. కారణం ఏమై ఉంటుందంటారు?**

జీవిత వెళ్లి వారం కావస్తోంది. ఏ ఫోనూ రాలేదు.

ఈలోగా ఎమ్మెల్యే జీవితని గురించి ఎంక్వయిరీ మొదలుపెట్టాడు. నన్నడిగితే నాకూ తెలీదన్నాను. ఆకాశ్ వాళ్లు తల్లీకూతుళ్లని మాయం చేశారా? లేక బెదిరించి ఎటైనా పంపేశారా? అంటూ రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

ఆ రోజు పోస్టులో జీవిత దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

''హలో ఫ్రెండ్!


మేము క్షేమం. నీవెలా ఉన్నావు?

అంత హఠాత్తుగా మేము ఊరు వదిలి వెళ్లటానికి కారణం ఊహించలేక కంగారు పడి ఉంటావు కదూ! సారీ! నీలాంటి మంచి స్నేహితురాలకి చాలా టెన్షన్ పెట్టేశాను.

నాకు ఆకాశ్‌ని పెళ్లి చేసుకునే ఆలోచన లేదని మొత్తుకున్నా వినకుండా ఎమ్మెల్యే దీన్నొక ఛాలెంజిగా తీసుకుని మా పెళ్లి చేయటానికి ప్రయత్నిస్తున్నాడు. అది నాకు ప్రాణసంకటంగా ఉంది.

నేను ఆకాశ్‌ని మనస్ఫూర్తిగా ప్రేమించిన మాట నిజం. పెళ్లిచేసుకోవాలని కూడా అనుకున్నాను. కానీ అతను పెద్దవాళ్లు ఒప్పుకోక పోతే పెళ్లి చేసుకోలేనని అనటం మాత్రం నేను భరించలేకపోయాను. వాళ్లని కన్విన్స్ చేసే దాకా ఆగుదామంటే ఎంతకాలమైనా ఎదురుచూసేదాన్ని. కానీ అతనికా ఉద్దేశం లేదని వేరే పెళ్లికి రెడీ అవుతున్నాడని తెలిశాక నేనతన్ని ఎలా చేసుకోను?

నువ్వు నా వైపు నుంచి ఆలోచించు. అతన్ని రాజకీయ నాయకుల అండతో పెళ్లి చేసుకున్నా నేను సుఖంగా ఉండగలనా? వాళ్లెవరికీ ఇష్టం



లేనప్పుడు ఈ పెళ్లితో నేను బావుకునేదేముంది? కనీసం చేసుకునే వాడికి ఇష్టమైనా (మనస్ఫూర్తిగా) పెళ్లి చేసుకుని, కొంతకాలం గడిచాక మనసులు మారతాయని, సమాధాన పర్చగలమనో ఆశపడితే తప్పు లేదు. కానీ ఇదలా కాదే. ఇంత హడావిడిగా మా పెళ్లి చేసినా తర్వాత నా జీవితానికి, సుఖానికి వీళ్లు గ్యారంటీ ఇవ్వగలరా? ప్రేమకథగా మొదలై, రాజకీయరంగు పులుముకుని చివరికి నా జీవితం ఏమైపోతుందో ఆలోచించు.

మొగుడికి, ఇంట్లో వాళ్లకి ఇష్టం లేకపోతే ఓ ఆడపిల్లని కడతేర్చటం ఇప్పుడు చిటికెలో పని. హత్య చేయటం ఆత్మహత్యగా చిత్రించటం, లేకపోతే ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు కల్పించటం... ఇలాంటి ఎన్నో వార్తలు మనం రోజూ పేపర్లలో చదువుతున్నాం. కొన్ని కుటుంబాల్లో ఆడవాళ్లు చావలేక బ్రతుకుతున్నారు. బ్రతకలేక చస్తున్నారు. పెళ్లయ్యాక సుఖానికి కాదు కదా అసలు బ్రతకటానికి అవకాశం ఉంటుందా అని నా అనుమానం. అలా జరగొచ్చు. జరగకపోవచ్చు. అలాగని నాకు పూర్తి నమ్మకం లేని పని చేసి రిస్క్ తీసుకోదలుచుకోలేదు.

నేను ఎంతగానో ప్రేమించిన ఆకాశ్ చేసిన మోసానికి, అతని అవకాశావాదానికి తట్టుకోలేక ఒక తొందరపాటు నిర్ణయం తీసుకున్నాను. జీవితం విలువ తెలుసుకోక అంతం చేసుకోవాలనుకున్నా దేవుడు నాకు మరో అవకాశం ఇచ్చినందుకు నేనెంతో అదృష్టవంతురాలిననుకుంటున్నాను. నేనే లోకంగా బ్రతికే అమ్మకి దూరమై ఎంతో క్షోభ పెట్టబోయాను. తలుచుకుంటే సిగ్గనిపిస్తుంది.

ఇంక నేను అక్కడికి రాకపోవచ్చు. నా వాళ్లంతా ఇక్కడే ఉన్నారు కాబట్టి అమ్మతో బాటు ఇక్కడే సెటిలైపోతాను. మంచి ఉద్యోగం సంపాదించి, జరిగినదంతా పీడకలలా మరిచిపోయేట్టు అమ్మని సుఖపెడతాను. ఆ జ్ఞాపకాలకూ, మనుషులకూ దూరంగా ఇలా వచ్చి ఇక్కడ కొత్త జీవితాన్ని ప్రారంభించే అవకాశం ఇచ్చినందుకు దేవుడికి నేనెంతో కృతజ్ఞురాలిగా ఉంటాను.

నీలాంటి స్నేహితురాలికి దూరమైనందుకు బాధగా ఉన్నా, ఉత్తరాలు, ఫోన్ల ద్వారా టచ్‌లో ఉంటాను కదా అని తృప్తి పడుతున్నా.

ఉంటాను

జీవిత''

ఉత్తరం చదివాక మనసులో ఉన్న బాధంతా కరిగిపోయి మనసు తేలికైంది. ఎక్కడో అక్కడ తను సంతోషంగా, సురక్షితంగా ఉంటే చాలనుకుని, వెంటనే ఆల్ ది బెస్ట్ అంటూ ఉత్తరం రాయటానికి ఉపక్రమించాను.

☆